## పేదలకు రేషన్ కిట్ల పంపిణీ అభినందనీయం



రేషన్ కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

**యాకుత్‌పురా:** పేదలకు రేషన్ కిట్ల పంపిణీ అభినందనీయమని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా మజ్లిస్ పార్టీ సీనియర్ నాయకుడు మహ్మద్ వసీముద్దీన్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం రెయిన్ బజార్‌లో నిర్వహించిన ఉచిత నిత్యావసర వస్తువుల (జాకత్) పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరై స్థానికులకు రేషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెయిన్ బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్, మజ్లిస్ పార్టీ నాయకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## సన్మానం



శ్రీకృష్ణను సన్మానిస్తున్న వడ్లమూరి కృష్ణ స్వరూప్ తదితరులు

**గన్‌ఫౌండ్రీ:** విశ్వవిద్యాలయం నుంచి జెనిటిక్స్ విభాగంలో డాక్టరేట్ పొందడం పబ్బతి శ్రీకృష్ణ కృషి ఎంతో అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బి.వెంకటయ్య అన్నారు. ఆదివారం సైఫాబాద్‌లోని డాక్టర్ అంబేడ్కర్ రిసోర్స్ సెంటర్‌ను ఇటీవల డాక్టరేట్ పట్టాపొందిన పబ్బతి శ్రీకృష్ణను సన్మానించారు. ఈ సందర్భంగా దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ మాట్లాడుతూ..జెనిటిక్ విభాగంలో డాక్టరేట్ పట్టా పొందిన వ్యక్తులు చాలా తక్కువ అని అందులో శ్రీకృష్ణ ఒకడు కావడం తమకు ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ ప్రొఫెసర్ వెంకటపతి, మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్కా దేవేందర్‌రావుతో పాటు మాల మాదిగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## 'ఇఫ్తార్ విందులు ఐక్యతను పెంపొందిస్తాయి'



ఇఫ్తార్ విందులో ఏసీపీ సయ్యద్ ఫయాజ్

**గోల్కొండ:** ఇఫ్తార్ విందులు ఐక్యతను పెంపొందిస్తాయని గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అక్బర్‌బాగ్‌లోని ఆర్గనైజేషన్ కార్యాలయంలో ఇఫ్తార్ విందు జరిగింది. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, స్థానికుల మధ్య ఇటువంటి ఇఫ్తార్ విందులు వారధిలాగ పని చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ ఏసీపీ నయిముద్దీన్ జావిద్, ఏసీపీ కె.చంద్రశేఖర్‌రెడ్డి, టీఎఫ్‌సీఓ కార్యాలయ ఇన్‌చార్జి మహ్మద్ ఫయాజ్, ఎంజేపీ డైరీ ప్రొడక్ట్స్ అధినేత మహ్మద్ గౌస్, ఇస్మాయిల్, సిద్దిక్ తదితరులున్నారు.

## నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి పడి ఇద్దరికి గాయాలు

**నాంపల్లి:** నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి పడి ఇద్దరు గాయపడిన ఘటన హబీబ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు, బాధిత కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. మెహిదీపట్నం సర్కిల్–12 టౌన్‌ప్లానింగ్ పరిధిలో ఇంటి నిర్మాణం జరుగుతోంది. ఐదో అంతస్తులో జరిగే పనుల్లో ఒరిస్సాకు చెందిన సుశాన్(30), మహారాష్ట్రకు చెందిన సోనూ(35) ఫలక్‌నుమాకు చెందిన ఓ కాంట్రాక్టర్ కింద కార్మికులుగా పనిచేస్తున్నారు. ఈ నెల 3న మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో పై అంతస్తు నుంచి జారి కిందపడ్డారు. సుశాన్ తలకు బలమైన గాయాలు కావడంతో పాటు పాదంలోనికి రాడ్డు గుచ్చుకుంది. సోనూకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో సుశాన్‌ను పంజాగుట్టలోని నిమ్స్, సోనూను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. సుశాన్ అపస్మారకస్థితిలో ఉన్నట్లు తెలిసింది. బాధితులకు న్యాయం జరగాలంటే పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కావాలి. అయితే ఘటన జరిగి వారం రోజులు కావస్తున్నా కేసు నమోదు కాకపోవడం గమనార్హం.

## రైలు కిందపడి గుర్తుతెలియని యువకుడి ఆత్మహత్య

**నాంపల్లి:** రైలు కిందపడి గుర్తుతెలియని యువకుడి ఆత్మహత్య చేసుకున్న ఘటన నాంపల్లి రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలోని సనత్‌నగర్–భరత్‌నగర్ రైల్వే స్టేషన్ల మధ్యలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..సుమారు 35 ఏళ్ల వయస్సు గల ఓ గుర్తుతెలియని యువకుడు ఆదివారం సనత్‌నగర్–భరత్‌నగర్ రైల్వే స్టేషన్ల మధ్యలో రైలు పట్టాలపై తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి ఒంటిపై కాఫీ రంగు చెక్స్ ఫుల్ షర్టు, తెలుపు రంగు జీన్స్ ప్యాంటు ధరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## నెలాఖరులోగా
# ఏటీసీలు రెడీ

### మల్లేపల్లి, ఖైరతాబాద్ సెంటర్ల పనులు చకచకా

### యువతకు మెరుగైన శిక్షణే లక్ష్యంగా అప్‌గ్రేడ్



మల్లేపల్లిలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న ఖైరతాబాద్ ఏటీసీ



ప్యారం నర్సయ్య, డిప్యూటీ డైరెక్టర్, ఉపాధి కల్పన శాఖ

**నాంపల్లి:** అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్స్(ఏటీసీ) నిర్మాణాల పనులు తుదిదశకు చేరుకున్నాయి. గతేడాది పారిశ్రామిక శిక్షణా సంస్థల(ఐటీఐ)ను రాష్ట్ర ప్రభుత్వం ఏటీసీలుగా అప్‌గ్రేడ్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా మల్లేపల్లి ప్రాంగణంలోని ఖైరతాబాద్, మల్లేపల్లి ఏటీసీల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఏటీసీల నిర్మాణ పనులు ఈ ఏడాది జనవరి చివరి నాటికి పూర్తి కావాల్సి ఉంది. అయితే పనులు కాస్త మందగించడంతో జాప్యం ఏర్పడింది. జీహెచ్‌ఎంసీ పరిధిలో మొత్తం ఎనిమిది ఐటీఐలను ఏటీసీలుగా అప్‌గ్రేడ్ చేశారు. వీటిలో తొలిదశ కింద మల్లేపల్లి, ఖైరతాబాద్ సెంటర్లు సిద్ధమవుతున్నాయి. అందుబాటులోకి వచ్చిన రెండు ఏటీసీల ద్వారా యువతకు మెరుగైన శిక్షణ అందజేస్తారు. ఏటీసీల ద్వారా లిమిటెడ్ కంపెనీల్లో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. టాటా, ఏరోస్పేస్, వరుణ్, మారుతీ సుజుకి, ఈసీఐఎల్, ట్రాన్స్‌కో, జెన్‌కో, టీఎస్ఆర్టీసీ, తోషిబా, బీహెచ్ఈఎల్, మిథాని, మెట్రో రైల్వేలో ప్లేస్‌మెంట్స్‌ను కల్పిస్తారు. పదో తరగతి పాసైన, ఫెయిలైన అభ్యర్థులు అడ్మిషన్లు పొందడానికి వీలు ఉంటుంది. ఏడాది, రెండేళ్ల కాల పరిమితి కలిగిన 41 రకాల కోర్సులు అందుబాటులో ఉంటాయి.

### అడ్మిషన్లకు త్వరలో నోటిఫికేషన్లు

మల్లేపల్లి ప్రాంగణంలోని ఖైరతాబాద్, మల్లేపల్లి ఏటీసీల నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయని ఉపాధి కల్పనల శాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్యారం నర్సయ్య తెలిపారు. ఈ నెలాఖరులో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం ఉంటుందన్నారు. ఇప్పటికే ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయని చెప్పారు. ఏటీసీలు అందుబాటులోకి వస్తే తక్షణ ఉద్యోగావకాశాలు లభిస్తాయని, ఏటీసీ సెంటర్లు/ఐటీఐలలో అడ్మిషన్లు పొందడానికి త్వరలోనే నోటిఫికేషన్లు జారీ చేయనున్నామని పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి రోబోటిక్ కోర్సును కూడా ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. ఈ కోర్సులో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని, ఈ కోర్సు పూర్తి చేసిన వారికి లేక్ మిషన్లు, మిల్లింగ్ మిషన్స్‌లో ప్లేస్‌మెంట్స్ లభిస్తాయని వెల్లడించారు. ఇంకా అప్‌గ్రేడ్ కానీ ఐటీఐ ప్రాంగణాల్లో మొత్తం 41 రకాల కోర్సుల్లో ప్రవేశాలు జరుగుతాయి. ఈ కోర్సుల్లో కొన్ని ఇంజినీరింగ్, మరికొన్ని నాన్ ఇంజినీరింగ్ కోర్సులు ఉన్నాయి.

విద్యార్థుల నుంచి ఎలాంటి ఫీజు వసూలు చేయరు. అడ్మిషన్ తీసుకున్నవారికి ఉపకార వేతనాలు, స్టైపండ్, బస్‌పాస్ సౌకర్యాలు ఉంటాయి. అకడమిక్ అడ్మిషన్లు ఆన్‌లైన్ పద్ధతిలోనే జరుగుతాయి.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



అవార్డు గ్రహీతలతో హీరో సుమన్

**నాంపల్లి:** ఇండియన్ సోషియో కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ అద్దంకి రాజా యోనా ఆధ్వర్యంలో పుడమి సాహిత్య వేదిక అధ్యక్షుడు డాక్టర్ చిలుముల బాల్‌రెడ్డి అధ్యక్షతన భాస్కర్ ఆడిటోరియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హీరో సుమన్ హాజరై మాట్లాడుతూ..అన్ని రంగాల్లో మహిళలు రాణించాలని పిలుపునిచ్చారు. సినీనటి దివ్యవాణి మాట్లాడుతూ..పురుషాధిక్య ప్రపంచంలో మహిళలు ధైర్యంగా అడుగులు వేసినప్పుడే అనుకున్న లక్ష్యం చేరుకోగలమన్నారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభావంతులైన 22 మంది మహిళలకు ఇన్‌స్పిరేషనల్ ఉమెన్ నేషనల్ అవార్డులు ప్రదానం చేశారు. సముద్రాల వేణుగోపాలాచారి, శేషసాయి, బాల్సన్ నాయక్, వేణుగోపాల కృష్ణ, కాశెట్టి కుమార్ పాల్గొన్నారు.

## మేరు కులస్తులకు ప్రాధాన్యమివ్వాలి



ముకుల్‌వాస్నిక్‌ని సత్కరిస్తునన శ్రీనివాస్

**అఫ్జల్‌గంజ్:** మేరు కులస్తులకు కాంగ్రెస్ ప్రభుత్వం తగిన ప్రాధాన్యమివ్వాలని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. 40 ఏళ్లకు పైగా కాంగ్రెస్ పార్టీలో ఉంటూ కాంగ్రెస్ జెండాలు మోస్తున్న తనకు చైర్మన్ పదవి ఇప్పించాలని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ముకుల్ వాస్నిక్‌ని కలిసి సత్కరించి మెమోరాండం అందజేశారు. అనంతరం పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ..లక్షల మంది మేరు కులస్తులు కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ పార్లమెంటు ఎన్నికల్లో విజయం సాధించే విధంగా కృషి చేశారన్నారు. తనలాంటి సీనియర్ నేతకు నామినేటెడ్ చైర్మన్ పదవి అప్పగించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆదిమూలం శంకర్, వినయ్‌రాజ్, వెన్ను శివకుమార్, ప్రసాద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ ఆలయం, మసీదుకు ఒక కానిస్టేబుల్



కేటాయించిన కానిస్టేబుళ్ల లిస్టును పరిశీలిస్తున్న ఏసీపీ సయ్యద్ ఫయాజ్, ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్

**లంగర్‌హౌస్:** పుకార్ల భయం తొలగిస్తూ, శాంతి భద్రత పరిరక్షణ కోసం ప్రతీ ఆలయం, మసీదులకు ఒక కానిస్టేబుల్‌ను నియమించడం అనివార్యమని ఏసీపీ సయ్యద్ ఫయాజ్, ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్ అన్నారు. లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆలయాలు, మసీదులకు కానిస్టుబుళ్లను నియమించారు. ఈ సందర్భంగా ఆలయాలు, మసీదుల నిర్వాహకులతో ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ సయ్యద్ ఫయాజ్, ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్ మాట్లాడుతూ..ప్రతి ఆలయం, ప్రార్థనా మందిరానికి ఒక్కో కానిస్టేబుల్‌ను నియమించామన్నారు. ఈ కానిస్టేబుల్ నిత్యం నిర్వాహకులకు అందుబాటులో ఉంటూ, రెండు రోజులకు ఒకసారైనా కచ్చితంగా వారిని కలుస్తారన్నారు. ఆయా ప్రాంతాల్లో ఏదైన సమస్యలు తలెత్తినా, అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, ఇబ్బందికర ఘటనలు చోటుచేసుకున్నా నిర్వాహకులు వెంటనే ఆ సంబంధిత కానిస్టేబుల్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు రాజు, రాఘవేంద్ర పాల్గొన్నారు.

## మహిళలు హక్కుల కోసం ఐక్యంగా ముందుకు సాగాలి



మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న గైబువల్లి తదితరులు

**గన్‌ఫౌండ్రీ:** సాధికారత, హక్కులు, అభివృద్ధి దిశగా మహిళలు ముందుకు సాగాలని హిందీ ప్రచార సభ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి ఎస్.గైబువల్లి కోరారు. ఆదివారం నాంపల్లి స్టేషన్‌రోడ్డులోని హిందీ ప్రచార సభ కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పలువురు మహిళా ప్రొఫెసర్లు, ఉపాధ్యాయులు, సమాజ సేవకులు, ఉద్యోగులకు విశిష్ట మహిళా ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. హిందీ ప్రచార సభ కన్వీనర్ శృంతికాంత్, ఆదాయ పన్నుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ మమతా సాహు, ఓయూ ప్రొఫెసర్ సంగీత వ్యాస్ తదితరులు పాల్గొన్నారు.

## సండే..సందడి



గోల్కొండ కోటలో..

జూన్ మార్కెట్ సందర్భంగా వినియోగదారులు అధిక సంఖ్యలో చార్మినార్‌కు చేరుకోవడంతో కాలి నడకకు కూడా అవకాశం లేకుండా పోయింది. నడిచి వెళ్లేందుకు కూడా చోటు లేకపోవడంతో సందర్శకులు నడిరోడ్డుపైనే ముందుకు వెళ్లారు.

**చార్మినార్:** పాతబస్తీలోని పర్యాటక స్థలాలన్నీ ఆదివారం సందర్శకులతో కిటకిటలాడాయి. చార్మినార్, మక్కామసీదు, గుల్జార్‌హౌజ్, పత్తర్‌గట్టి, మదీనా, నయాపూల్, సాలార్‌జంగ్ మ్యూజియం, హెచ్ఈహెచ్ నిజాం మ్యూజియం, చౌమహల్లా ప్యాలెస్‌లతో పాటు జూ పార్కు తదితర ప్రాంతాలన్నీ సందడిగా కనిపించాయి. సందర్శకులు పెరగడంతో చిరువ్యాపారాలకు గిరాకీ పెరిగింది. రం

### గోల్కొండ కోటలో..

**గోల్కొండ:** పర్యాటక ప్రాంతమైన గోల్కొండ కోట ఆదివారం పర్యాటక శోభను సంతరించుకుంది. సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కోటలో యువకులు, యువ జంటలు కోటలోని ఫిరంగులు, రామదాసు బందీకానా, ఆయుధాగారం, రాణి మహల్ తదితర ప్రాంతాల్లో సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు.



చార్మినార్–చార్‌కమాన్ రోడ్డులో..



గుల్జార్‌హౌజ్ రోడ్డులో..

## మహిళా సాధికారతకు కృషి చేయాలి



నారి హై శక్తి కార్యక్రమంలో ఎక్సైజ్ ఏఈఎస్ అంజిరెడ్డి, నందకిశోర్ వ్యాస్ తదితరులు

**అబిడ్స్:** మహిళా సాధికారతకు కృషి చేయాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రాష్ట్ర అసిస్టెంట్ కమిషనర్, ధూల్‌పేట ఎక్సైజ్ స్పెషల్ అధికారి ఎస్.అంజిరెడ్డి పేర్కొన్నారు. ధూల్‌పేట్‌లో కరిష్మాసింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నారీ హై శక్తి అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వం మహిళా రంగ అభివృద్ధికి ఎంతో చేయూతనిస్తుందన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు నందకిశోర్‌వ్యాస్ మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యమిస్తుందన్నారు. మహిళా శక్తితోనే ప్రపంచం ముందుకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పప్పుమాత్రే, ఆనంద్‌సింగ్, ఇతర నాయకులు జయేష్ ఢిల్లీవాలా, డాక్టర్ కవిత, కీర్తి సునిల్ బిదుర్, నిఖిత, శంకర్‌సింగ్, న్యాయవాది రజని, మణిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల అభ్యున్నతికి కృషి



పురస్కార గ్రహీతలతో ఎమ్మెల్యే పద్మావతి తదితరులు

**గన్‌ఫౌండ్రీ:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేస్తుందని శాసన సభ్యులు ఉత్తమ్ పద్మావతి రెడ్డి అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో మెగాసిటీ నవకళావేదిక, మదర్ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రంగాలలో రాణిస్తున్న మహిళలకు ఉమెన్ ఎక్సలెన్స్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సినీ సంగీ విభావరి ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి ఎస్.వేణుగోపాలచారి, ప్రముఖ వైద్య నిపుణులు టి.ఆనందమూర్తి, గాంధీ మెడికల్ కళాశాల అసోసియేషన్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రతిభా లక్ష్మీ, ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లికార్జున్‌రావు, రాఘవ తదితరులు పాల్గొన్నారు.



## కార్వాన్ డివిజన్‌లో బీజేపీ పటిష్టం



మాట్లాడుతున్న జగదీష్‌కుమార్

**గోల్కొండ:** కార్వాన్ డివిజన్‌లో బీజేపీ పటిష్టంగా ఉందని డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఉద్దడి జగదీష్‌కుమార్ అన్నారు. ఆదివారం కార్వాన్‌లో బీజేపీ డివిజన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా కార్వాన్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి విజయం ఖాయమన్నారు. తెలంగాణను పదేళ్లు పాలించిన బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందన్నారు. తెలంగాణలో బీజేపీ ఎంత బలంగా ఉందో ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు స్పష్టం చేశాయన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి కె.బాలకృష్ణ, భరత్‌కుమార్, నరేష్‌జాదవ్, గోవింద, ఎస్.గోపాల్, సాయికుమార్ తదితరులున్నారు.

## రంజాన్ ఉపవాస దీక్షలు నిష్టగా ఆచరించాలి

**గోల్కొండ:** రంజాన్ ఉపవాస దీక్షలు నిష్టగా ఆచరించాలని హజ్రత్ మౌలానా సయ్యద్ షా ఔలియా హుస్సేనీ అన్నారు. ఆదివారం ఆయనను మజ్లిస్ ఆధ్వర్యంలో చోటాబజార్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రంజాన్‌లో ప్రతినిత్యం ఐదు పూటలు నమాజ్ చేసే వారికి పాపాల నుంచి విముక్తి పొందే అవకాశం ఉంటుందన్నారు. రంజాన్‌లో నిరుపేదలకు చేతనైనంత సహాయం చేస్తుండాలని, దీన్ని ద్వారా పేదలు సైతం సంతోషంగా పండుగలు జరుపుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు అబీబ్‌చౌస్, సలీమ్, అతీఖ్‌రజాక్, ఆలీమ్, మహ్మద్ జాహేద్ తదితరులున్నారు.



మజ్లిస్ నాయకులతో హజ్రత్ మౌలానా సయ్యద్ షా ఔలియా హుస్సేనీ

## సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

**గోల్కొండ:** సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో కార్వాన్, నానల్ నగర్, లంగర్‌హౌస్ డివిజన్‌లకు చెందిన పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎంఆర్ఎఫ్ పథకం వల్ల నిరుపేదల శస్త్ర చికిత్సలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ఆయన తన కార్యాలయానికి వచ్చిన వారితో మాట్లాడి వారి ఫిర్యాదులను విన్నారు. నల్లాల్లో వస్తున్న నీరు లోప్రెజర్‌తో వస్తుందని ఫిర్యాదు చేశారు. గోల్కొండలోని పలు ప్రాంతాల్లో నల్లాల్లో నీరు 20 నిమిషాల కంటే ఎక్కువ రావడం లేదని వస్తున్న నీరు తాగునీటి అవసరాలకే సరిపోతుందని ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ..కార్వాన్ నియోజకవర్గంలో నీటి సరఫరాలో సమస్యలు ఉన్న ప్రాంతాలను గుర్తించామన్నారు. వారం రోజుల్లో ఆ సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. అలీముద్దీన్, సయ్యద్ రఫత్ హుస్సేన్ తదితరులున్నారు.

# పురాతన భవనాల కూల్చివేతకు రంగం సిద్ధం

### మెట్రో పనుల్లో భాగంగా పాతబస్తీలో కనుమరుగు కానున్న భవనాలు



మున్షీ నాన్ దుకాణం, పురానిహవేలీ



అబ్బాసీ నాన్ రోటీ దుకాణం, పురానిహవేలీ

**యాకుత్‌పురా:** పాతబస్తీ మెట్రో నిర్మాణ పనుల సందర్భంగా చేపట్టిన కూల్చివేతల్లో పురాతన భవనాల్లో కొనసాగుతున్న నిజాం కాలంనాటి నాన్‌రోటీ వ్యాపార సముదయాలను తొలగిస్తున్నారు. కూల్చివేతలో భాగంగా దారుషిఫా పురానిహవేలీలోని హెచ్ఈహెచ్ 4వ నిజాం కాలం నాటి నుంచి కొనసాగుతున్న వ్యాపార సముదాయాలను తొలగిస్తున్నారు. పురాతన వ్యాపార భవనాల కూల్చివేతల కారాణంగా వ్యాపారులతో పాటు కార్మికులు సైతం ఉపాధి కోల్పోనున్నారు.

### 1851 నుంచి నాన్ రోటీ దుకాణం..

పురాని హవేలీలోని ఫ్యామిలీ కోర్టు పక్కనున్న మున్షీ నాన్ రోటీ వ్యాపారాన్ని హెచ్ఈహెచ్ 4వ నిజాం పరిపాలన కార్యాలయంలో మున్షీ (అకౌంట్స్ క్లర్క్)గా పని చేసిన మహ్మద్ హుస్సేన్ నిజాం కార్యాలయ మున్షీగా ప్రజలకు సుపరిచితుడు కావడంతో తన సొంత భవనంలో 1851లో మున్షీ నాన్ రోటీ వ్యాపారాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి మున్షీ నాన్‌గా ప్రసిద్ధి చెందిన ఈ దుకాణంలో తయారు చేసి విక్రయించే నాన్ రోటీ ప్రాముఖ్యతను సంతరించుకుంది. పాయా షోర్వాలో ఇష్టంగా భుజించే ఈ రోటీని నగరంతో పాటు దేశ, విదేశాలకు విక్రయిస్తుంటారు.

### 1853లో ఏర్పాటు చేసిన అబ్బాసీ నాన్ దుకాణం..

పురానిహవేలీలో 1853లో ఫకీర్ మహ్మద్ అబ్బాసీ నాన్ రోటీ దుకాణం ఏర్పాటు చేశారు. అనాటి నుంచి రోటీ వ్యాపారాన్ని ఆయన కుమారుడు కుత్బుద్దీన్, మనుమడు మహ్మద్ సైఫుద్దీన్, ప్రసుత్తం ముని మనుమడు మహ్మద్ ముస్తాఫవుద్దీన్ కొనసాగిస్తున్నారు. మెట్రోరైల్ నిర్మాణ పనుల సందర్భంగా ఈ పురాతన భవనాన్ని అధికారులు కూల్చివేయనున్నారు.

**పాతబస్తీ మరింత అభివృద్ధి చెందుతుందని ముందుకొచ్చాం..**



1851లో మా పూర్వీకులు ప్రారంభించిన నాన్ రోటీ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాం. మేము తయారు చేసే రోటీకి నగరంతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాలకు, పలు దేశాలకు విక్రయాలు చేస్తుంటాం. ఎక్కడ బ్రాంచ్‌లు ఏర్పాటు చేయకుండా ఇక్కడే కొనసాగిస్తున్నాం. మెట్రో రైల్ పనుల కారణంగా మా పురాతన భవనంతో పాటు వ్యాపారాన్ని కోల్పోతున్నాం. మెట్రోరైల్ నిర్మాణంతో పాతబస్తీ మరింత అభివృద్ధి చెందుతుందని ముందుకొచ్చాం.

– సయ్యద్ ఫరీదుద్దీన్, మున్షీ నాన్ యాజమాని, పురానిహవేలీ

**పురాతన వ్యాపార భవనాన్ని కోల్పోతున్నాం..**



మా పూర్వీకులు 1853లో ఏర్పాటు చేసిన అబ్బాసీ నాన్ రోటీ దుకాణాన్ని నాటి నుంచి మా తాత, నాన్న, ప్రస్తుతం మేము కొనసాగిస్తున్నాం. స్వయంగా తయారు చేసి విక్రయించే రోటీలను నగరంతో పాటు వివిధ ప్రాంతాల్లోని హోటల్స్, ఫాస్ట్‌ఫుడ్, పాయా షోర్వా విక్రయదారులు ముందస్తు ఆర్డర్లతో తీసుకెళ్తుంటారు. వివాహాలు, డిన్నర్లకు ప్రత్యేకంగా విక్రయిస్తుంటాం. ఏళ్ల తరబడి ఈ భవనంలో వ్యాపారం చేస్తూ మా కుటుంబాలను పోషిస్తున్నాం. పురాతన భవనాన్ని కోల్పోతున్నందుకు బాధగా ఉంది.

– మహ్మద్ ముస్తాఫవుద్దీన్, అబ్బాసీ నాన్ యాజమాని, పురానిహవేలీ